
సాక్షి
పెద్దపల్లి

బుధవారం। 11 । డిసెంబర్ । 2024

కష్టానికి కాపలా



అకాల వర్షాలు అన్నదాతనే కాదు.. ఇటుక బట్టీ నిర్వాహకులకూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి.. వేలాది మంది కూలీలు రాత్రీపగలు తేడాలేకుండా శ్రమించి తయారు చేసిన ఇటుకలను ఎండలో ఆరబెడుతున్నారు. అయితే, హఠాత్తుగా కురుస్తున్న వర్షాలతో తడిసిపోవడంతో చేసేదిలేక బట్టీలపై ఇలా పరదాలు కప్పుతూ ఇటుకలను కాపాడుకుంటున్నారు నిర్వాహకులు. పెద్దపల్లి శివారులోని రాఘవాపూర్, రంగాపూర్, గౌరెడ్డిపేటలో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

న్యూస్‌రీల్

'రాజకీయాలకు తలొగ్గ వద్దు '



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్

ధర్మారం(ధర్మపురి): రాజకీయాలకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ అనుమతులు జారీచేస్తే పంచాయతీ కార్యదర్శులే బాధ్యులవుతారని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అర్హులైన పేదకుటుంబాలను గుర్తించి తయారు చేసిన జాబితాను ఎంపీడీవోకు పంపించాలని ఆయన ఆదేశించారు. విమర్శలకు తావులేకుండా జాబితా ఉండాలని ఆయన అన్నారు. జాబితా వచ్చాక ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్షించి అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ ఎండీ అరిఫ్, పంచాయతీరాజ్ డీఈఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు పరామర్శ



రాజేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేశ్‌ను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. రాజేశ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఠాకూర్ సూచించారు.

హిందువులపై దాడులు ఆపాలి



నిరసన ర్యాలీలో ప్రతినిధులు

జ్యోతినగర్(రామగుండం): బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలు, హిందువులపై దాడులను వెంటనే ఆపేయాలని హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ, హిందువులు, స్వామీజీలు, ఆలయాలు, మహిళలపై దాడులు చేయడం సరికాదన్నారు. అనంతరం రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ యూత్, వ్యాపార, వర్తక, హిందూ సంఘాలు, అయ్యప్ప సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్‌ను స్థానిక ప్రైవేట్ కళాశాలలో మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24, 25వ తేదీల్లో సిద్దిపేటలో నిర్వహిస్తారన్నారు. సుమారు 1,500 మంది యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, ప్రముఖులు తరలివస్తారని, విద్యారంగ సమస్యలపై చర్చిస్తారని ఆయన వివరించారు. మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బండి రాజశేఖర్, అజయ్, సందీప్, అరవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గనులపై మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటన



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిలో మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటించింది. కార్పొరేట్ మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సంస్థ స్థితిగతులను ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా వివరించింది. గనిలో ఉత్పత్తి, యంత్రాలపై కార్మికులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోశం, ఏరియా ఇంజినీర్ డీవీరావు, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, ఏజెంట్ శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు పాల్గొన్నారు.

పరిశోధనకు ప్రశంస

- జాతీయస్థాయిలో సిమ్స్' మెడికోల ఖ్యాతి
- పీజీ, పీహెచ్‌డీ, శాస్త్రవేత్తల పరిశోధనలకు దీటుగా నిలిచిన వైనం
- దేశంలోనే తొలిసారి గోదావరిఖని మెడికల్ కాలేజీకి ప్రత్యేక గుర్తింపు
- అంతర్జాతీయ ప్రముఖులతో అభినందనలు అందుకున్న మెడికోలు



సిమ్స్ కాలేజీ మెడికోలను ప్రశంసిస్తున్న ఏసీబీ ఐకాన్ జాతీయ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఇందువర్మ



మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



పరిశోధనపై ప్రదర్శనలిస్తున్న మెడికోలు

కోల్‌సిటీ(రామగుండం): బయో కెమిస్ట్రీ ఒక సంక్లిష్టమైన పాఠ్యాంశం. ఈ సబ్జెక్టును ఎంచుకున్న గోదావరిఖని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్–ప్రభుత్వ) కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సృజన, ఆరుషి, అన్షు, హర్షవర్ధన్, సాత్విక్, అభిరామ్, సందీప్, రిషిరావ్ వివిధ అంశాలపై పరిశోధనలు చేశారు. 'విటమిన్–డి, శ్వాసకోస సంబంధిత సమస్యలు –ప్రభావం', మెదడు – జ్ఞాపక శక్తి', 'లెడ్ టాక్సిసిటీ – నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు'పై అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ వర్ధన్ మార్గదర్శకత్వంలో వైద్య విద్యార్థులు చేసిన ఈ పరిశోధనలు జాతీయస్థాయిలో ప్రశంసల జల్లులు కురిపించాయి.

దేశవ్యాప్తంగా 1,200 మంది హాజరు

బయో కెమిస్ట్రీపై చండీగఢ్‌లో ఈనెల 4 – 7 వరకు జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. దేశంలోని పలు ప్రముఖ మెడికల్ కాలేజీల నుంచి సుమారు 1,200 మందికిపై పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్న మెడికోలతోపాటు పరిశోధకులూ హాజరయ్యారు. దేశ, విదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలిసారి

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ క్లినికల్ కెమిస్ట్రీ(ఐఎఫ్‌సీసీ) సహకారంతో అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ ఆఫ్ ఇండియా(ఏసీబీ ఐకాన్–2024) ఏటా జాతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తోంది. వైద్య పరిశోధలు చేసే మెడికోలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటివరకు 49 సదస్సులు జరగా.. పీజీ, పీహెచ్‌డీలు చేసే మెడికోలు, శాస్త్రవేత్తల పరిశోధనలనే ఇందులో ప్రదర్శించడానికి అనుమతించేవారు. ఈసారి ఎంబీబీఎస్ స్టూడెంట్లు చేసిన పరిశోధనలనూ ఎంపిక చేయడం, అందులో సిమ్స్ మెడికోలకు ప్రశంసలు లభించడం విశేషం. అంతర్జాయతీయ స్థాయిలోనూ పరిశోధనలు చేయాల్సిందిగా విదేశీ ప్రతినిధులు ఆహ్వానించడం విశేషం.

మూడు బృందాలు..

సిమ్స్‌లోని ఎనిమిది మంది మెడికోలు అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్గనిర్దేశనంలో మూడు బృందాలుగా ఏర్పడ్డారు. 'విటమిన్–డి, శ్వాసకోస సంబంధిత సమస్యలు –ప్రభావం', మెదడు – జ్ఞాపక శక్తి', 'లెడ్ టాక్సిసిటీ – నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యలు'పై పరిశోధనలు చేసి నివేదిక తయారు చేశారు. పరిశోధనల ద్వారా విద్యార్థుల్లో వైద్యచికిత్సలపై అవగాహన పెంపొందడంతోపాటు పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మెడికోలు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పీజీ, పీహెచ్‌డీ, శాస్త్రవేత్తలకు దీటుగా సిమ్స్ ఎంబీబీఎస్ స్టూడెంట్లు చేసిన పరిశోధనలు జాతీయస్థాయి సదస్సులో ప్రదర్శనకు ఎంపిక కావడం, దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రముఖలతో ప్రశంసలు అందుకోవడం సిమ్స్ పేరును జాతీయస్థాయిలోకి తీసుకెళ్లినట్లయ్యింది.

అంతర్జాతీయ స్థాయిలో..



ఎండీ, పీహెచ్‌సీ స్థాయి మెడికోలకు దీటుగా దేశంలోనే గోదావరిఖని సిమ్స్ విద్యార్థులు పరిశోధనలు చేశారు. వీటిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తా. యూకే ప్రొఫెసర్ ఖోస్రో అడెలి, ఏసీబీ ఐకాన్ జాతీయ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఇందువర్మ ప్రశంసించడం గొప్ప అనుభూతినిచ్చింది.

– అశోక్‌వర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, బయోకెమిస్ట్రీ, గోదావరిఖని సిమ్స్

శ్వాసకోస సమస్యలపై పరిశోధన



విటమిన్–డి, శ్వాసకోస సంబంధిత సమస్యలు, ప్రభావంపై హర్షవర్ధన్, సందీప్‌తో కలిసి అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ మార్గదర్శనంలో పరిశోధన చేశాం. జాతీయ, అంతర్జాతీయ పరిశోధకులు మా ప్రదర్శనలను ప్రత్యేకంగా అభినందించడం ఆనందంగా ఉంది. – సృజన, మెడికో

జ్ఞాపకశక్తిపై..



బయోకెమిస్ట్రీ జాతీయ సదస్సులో పాల్గొనడం గర్వంగా ఉంది. మమ్మల్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌కుమార్ గైడ్ చేశారు. మెడికో సాల్వాజి రిషిరావుతో కలిసి న్యూరో బయోకెమెస్ట్రీలో మెదడు, దాని జ్ఞాపకశక్తి'పై చేసిన పరిశోధనను సదస్సులో ప్రదర్శించడం ఆనందంగా ఉంది. – గోషిక అన్షు, మెడికో

ఆనందంగా ఉంది



లెడ్ టాక్సిసిటీ, నాడీ వ్యవస్థ సంబంధిత సమస్యల మెడికో తిరుషి, అభిరామ్‌తో కలిసి చేసిన పరిశోధన చేశాం. ప్రతులను సదస్సులో ప్రదర్శించాం. మా ప్రదర్శనపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మెడికోలు ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం గర్వంగా ఉంది. – సాత్విక్, మెడికో

తొలిసారి జాతీయస్థాయిలో



మా కాలేజీ ఎంబీబీఎస్ స్టూడెంట్ల పరిశోధనలు తొలిసారి జాతీయస్థాయిలో ప్రదర్శించిన తీరు వారి ప్రతిభకు అద్దంపడుతోంది. బయోకెమెస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ల కృషి ప్రశంసనీయం. ఇదే స్ఫూర్తితో పరిశోధనలను అంతర్జాతీయ సదస్సుల్లో ప్రదర్శించేలా కృషి చేస్తాం. – హిమబిందుసింగ్, ప్రిన్సిపాల్, సిమ్స్ కాలేజీ

నిర్దేశిత గడువులోగా సీఎమ్మార్ అప్పగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లర్లు 2022–23 యాసంగి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను గడువులోగా అప్పగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ వేణుతో కలిసి పెండింగ్ సీఎమ్మార్‌పై సమీక్షించారు. 2022–23 యాసంగి సీఎమ్మార్‌ను ఇప్పటివరకు 60శాతమే అప్పగించారని, మిగతా బియ్యాన్ని ఈనెల 31లోగా అప్పగించాలని సూచించారు. ఆలస్యం చేస్తున్న రైస్ మిల్లుల్లో తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక ముందు గడువు పెంపు ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, అధికారి రాజేందర్, రైస్‌మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ స్ఫూర్తిని అవమానించడమే..



క్షీరాభిషేకం చేస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం అంటే తెలంగాణ స్ఫూర్తిని అవమానించడమేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మలిదశ ఉద్యమంలో అనివార్యంగా అస్తిత్వభావన ముందుకొచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ తల్లి రూపానికి అంకురార్పణ చేశారని, కొత్త తెలంగాణ తల్లి పేరిట కాంగ్రెస్ కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం పాలకులకు కనీస సోయిలేకుంటా పోతోందని విమర్శించారు. నాయకులు కల్వచర్ల కృష్ణవేణి, అయుత శివకుమార్, కుమ్మరి శ్రీనివాస్, కవితసరోజిని, మూల విజయారెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, చెలకలపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, మారుతి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: క్రమశిక్షణ, నిజాయతీతో విధులు నిర్వర్తించాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ కొత్త కానిస్టేబుళ్లకు సూచించారు. ఇటీవల ఉద్యోగంలో చేరిన ఏఆర్ కానిస్టేబుళ్లతో మంగళవారం తన కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఉద్యోగ ప్రయత్నంలో అనేక సవాళ్లను ఎదర్కొన్న ఉన్నత విద్యావంతులు నిబద్ధతతో ఉద్యోగ ధర్మం నిర్వర్తించాలన్నారు. సమయపాలన పాటించాలని, అధికారుల సలహాలు, సూచనలతో ముందుకు సాగాలని అన్నారు. ధర్నాలు, రాస్తారోకోల సందర్భంగా ఆందోళనకారులతో సమయస్ఫూర్తితో ప్రవర్తించాలని పేర్కొన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధం

సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌ల బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నామని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా డీజేలు, డ్రోన్‌లపైనా నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నామన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, పేషెంట్లు, విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించామన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్



బైక్ ర్యాలీలో బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి దక్కిన ప్రజాదరణే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. 'కాంగ్రెస్ పార్టీ ఆరు అబద్ధాలు, అరవై ఆరు మోసాలు' పేరిట బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండాచౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రదీప్ కుమార్ మాట్లాడారు. గతఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్ల శాతం తక్కువగా వచ్చిందని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఇక బీజేపీయేనని అన్నారు. విపక్షాలన్నీ ఏకమైనా కేంద్రంలో మూడోసారి మోదీనే గెలిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, కాసిపేట శివాజీ, లావణ్య, తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగేడ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, బైక్ ర్యాలీలో ఓ యువకుడు జెండా లాక్కొని పరుగెత్తగా బీజేపీ శ్రేణులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోలు

- అదనపు కలెక్టర్ వేణు ఆదేశాలు



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

మంథని: నిర్దేశిత తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వేణు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. పట్టణ శివారులోని పవర్‌హౌస్‌కాలనీ, అంగళూరుతోపాటు గుంజపడుగు, నాగారం, రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమశాతాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. 17శాతం తేమ రాగానే వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇలా కొనుగోలు చేసిన వడ్ల వివరాలను త్వరితగతిన ఓపీఎంఎస్‌లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర వర్తించేలా చూడాలని అన్నారు. తూకం వేసిన వడ్లను వెనువెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని చెప్పారు. రవాణాలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అకాల వర్షాల దృష్ట్యా పంట నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, అధికారి రాజేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్‌గౌడ్
- అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ కోరారు. విద్యారంగంలో నెలకొన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. పలువురు నాయకులతో కలిసి ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నేత ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కలెక్టరేట్ల ముట్టడిలో భాగంగా జిల్లా కేంద్రంలో ఆందోళన చేశామని అన్నారు. పెండింగ్‌లోని రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, కాలేజీ విద్యార్థులకు ఏడాదికి రూ.20 వేల స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, విదేశీ విద్యకు రూ.20 లక్షల స్టైఫండ్ అమలు చేయాలని ఆయన కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల స్కాలర్‌షిప్ పెంచాలని, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని, ప్రభుత్వమే అన్ని ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం ప్రసాద్, సరోజ, బొద్దుల అరుణ, నోమురి శ్రీధర్, దొడ్డిపట్ల శైలజ, వనిత, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో మాధవి, ఏఎంవో షేక్, ఎంఈవో ఓదెలు తదితరులు

- జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

ముత్తారం(మంథని): గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీ దృక్పథం అవసరమని, ఇందుకోసం మద్రాస్ ఐఐటీ నిర్వాహకులు చొరవ తీసుకోవడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. ధర్యపూర్ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఫ్రీ కెరీర్ గైడన్స్, సైన్స్ ఎడ్యుకేషన్‌లో డీఈవో మాట్లాడారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు టెన్త్, ఇంటర్ తర్వాత ఎలాంటి కోర్సుల్లో చదివితే భవిష్యత్ ఉంటుందనే సందేహాలను నివృత్తి చేశారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి ఆశయ సాధన కోసం ఐఐటియన్ పింగిలి విక్రమ్‌కుమార్ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కేరీర్ గైడెన్స్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఏఎంవో షేక్, ఎంఈవో ఓదెలు, ఎంపీడీవో సురేశ్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ తోట శారద పాల్గొన్నారు.

క్రీడలపై ఇష్టం పెంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): విద్యార్థులు క్రీడలపై ఇష్టం పెంచుకుని, జాతీయ స్థాయిలో రాణించాలని డీఈవో మాధవి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడాపోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంఈవో మహేశ్ మాట్లాడారు. హెచ్ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

6 రోజులు.. 12 యాత్రలు

- వివిధ పుణ్యక్షేత్రాల సందర్శన
- శబరిమలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం
- గోదావరిఖని డీఎం నాగభూషణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని నుంచి శబరిమలకు ఆర్టీసీ బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. స్థానిక శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శబరిమల గోదావరిఖని, పెద్దపల్లి నుంచి శబరిమలకు వెళ్లే భక్తుల కోసం సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను అద్దెప్రాతిపదికన కేటాయిస్తామన్నారు. ఇవి నాలుగు రాష్టాల నుంచి ఆరురోజుల పాటు ప్రయాణిస్తాయని ఆయన తెలిపారు. ఇందులో 12 యాత్రలు ఉంటాయని పేర్కొన్నారు. అధికారుల సూచన మేరకు భక్తులకు నచ్చిన రెండు రూట్లను ఎంచుకోవాలని ఆయన సూచించారు. భక్తులకు నచ్చిన మార్గంలోనూ సుమారు 3,300 కి.మీ. దూరం వరకు బస్సులను అద్దెకు ఇస్తామన్నారు. రిజర్వేషన్ చేసుకున్న భక్తుల కోసం శబరిమలలో స్వామిదర్శనం కోసం ఆర్టీసీ ప్రత్యేక వలంటీర్లను నియమించిందని ఆయన పేర్కొన్నారు.

13 నుంచి అరుణాచలం యాత్ర

గోదావరిఖని నుంచి ఈనెల 13, 14, 15వ తేదీల్లో అరుణాచలం యాత్రకోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తోందని డీఎం నాగభూషణం వెల్లడించారు. నిష్ణాతులైన ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి సరైన సమయాల్లో దైవదర్శం చేసి సురక్షితంగా ఇంటికి చేర్చుతారని ఆయన అన్నారు. శబరిమల అయ్యప్ప దర్శనం కోసం వెళ్లే భక్తులు, మాలలు ధరించిన స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రిజర్వేషన్ కోసం 99081 38036, 73828 47427 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, అధికారులు కేశవ్‌రెడ్డి, ఎస్ఎస్ మూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, ఉపాధ్యక్షుడు స్టాలినగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రెస్సా సమావేశం

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెస్సా) జిల్లాస్థాయి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ తదితరులు హాజరవుతారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి


శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రైతు చిందు శంకర్(50) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకర్ తనకున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం సాగు పనులకు వెళ్లాడు. రాత్రి వచ్చి, భోజనం చేసి, పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత గుండెలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు మెండె శ్రీనివాస్, మాజీ సర్పంచు బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ రమేశ్ కోరారు.

జీవాలపై హైనా దాడి


మృతిచెందిన గేదెను చూపుతున్న రైతు

చిగురుమామిడి: మండలంలో హైనా దాడులతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల్లో రెండు పశువులపై దాడి చేసి, చంపింది. సోమవారం అర్ధరాత్రి సుందరగిరికి చెందిన గైని చంద్రమౌళి గేదె, ఆదివారం అర్ధరాత్రి గాగిరెడ్డిపల్లికి చెందిన చెన్నవేని మల్ల య్య లేగదూడను చంపేసింది. హైనా బారి నుంచి తమను రక్షించాలని రైతులు కోరుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కోరుట్ల: బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్న ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన ఓ బాలికపై స్థానికుడైన ఇప్ప రవి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాధితురాలు తల్లిదండ్రులు విషయం చెప్పడంతో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రవిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడి రిమాండ్

ముస్తాబాద్(సిరిసిల్ల): బాలికను వేధిస్తున్న ఓ యువకుడిని పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన గుండెల్లి అజయ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను కొన్ని నెలలుగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి, అజయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎములాడలో గీతాజయంతి ఉత్సవాలు


హోమం చేస్తున్న అర్చకులు


గీతా పారాయణం చేస్తున్న విద్యార్థులు


ఎస్పీ గౌస్ ఆలంను సత్కరిస్తున్న అర్చకులు

వేములవాడ: ఎములాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గీతా జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనుబంధ దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తామని స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర శర్మ తెలిపారు. గీతాహోమం, గీతా ప్రవచనాలు, గీతాపారాయణం, దశమస్కంద పారాయణాలు, సాయంత్రం ప్రవచనాలు, గీతాభాష్య పారాయణాలు జరుపుతామన్నారు. ఈ నెల 12న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంస్కృత కళాశాల, వేద పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు నాగిరెడ్డి మండపంలో గీతా పారాయణం చేశారు. ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులున్నారు.

అభిషేకాలు.. అన్నపూజలు

వేములవాడ రాజన్నను మంగళవారం దాదాపు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసినవారు స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, అమ్మవారికి కుంకుమపూజ ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో ఆదిలాబాద్ ఎస్పీ

వేములవాడ రాజన్నను ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు కల్యాణ మండపంలో స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందించి, వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఎస్సై అంజయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ప్రొటోకాల్ ఇన్‌చార్జి శివసాయి ఉన్నారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

- మరొకరికి ఐదేళ్ల జైలు

జగిత్యాల జోన్: భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిని కిరాతకంగా హత్య చేసిన ఇద్దరు వ్యక్తులకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా, మరొకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి సుగళి నారాయణ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్‌కు చెందిన చెదలు రాజేందర్-లత దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. గ్రామ శివారులోని కొండాపూర్ ఒర్రె వద్ద భూమి ఉంది. ఈ ఒర్రెకు అవతలి వైపు కాస సంజీవ్ భూమి ఉంది. అందులోకి వెళ్లే దారి విషయంలో సంజీవ్, రాజేందర్‌ల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతోపాటు పూర్వీకులకు సంబంధించిన మూడెకరాల భూమి పైనా వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో రాజేందర్ జనవరి 3, 2022న భార్య లత, కూలీలతో కలిసి తన తోటలో వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఒర్రె పక్కనున్న వ్యవసాయ బావికి కరెంట్ మోటార్ బిగించేందుకు వెళ్లాడు. కాసేపటికే అరుపులు వినిపించడంతో లత, కూలీలు అక్కడికి పరుగెత్తారు. వారిని చూసి, సంజీవ్, మరికొందరు కత్తులతో పారిపోయారు. రాజేందర్ రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఉమాసాగర్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించి, కాస సంజీవ్‌తోపాటు తైడపల్లి రజనీకాంత్, మంగళారపు లక్ష్మీనారాయణలను అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్ వేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు రంజిత్, కిరణ్‌కుమార్ న్యాయస్థానంలో సాక్షులను ప్రవేశపెట్టారు. జడ్జి సాక్ష్యాధారాలు పరిశీలించి, సంజీవ్, రజనీకాంత్‌లకు యావజ్జీవం, లక్ష్మీనారాయణకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

కూతురిని కడతేర్చిన తండ్రికి జీవిత ఖైదు

కరీంనగర్ క్రైం: దివ్యాంగురాలైన కూతురిని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదుతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ మండలంలోని తీగలగుట్టపల్లికి చెందిన కొమిరె మహేందర్ భార్య చనిపోవడంతో చంద్రపురి కాలనీకి చెందిన భావనను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు పాప జన్మించింది. 6 నెలలకు ఆ చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో నరాలు దెబ్బతిని, కాళ్లుచేతులు పడిపోయాయి. ఆరేళ్ల వయసు వచ్చినా ఆ పాప కోలుకోలేదు. ఈ క్రమంలో మహేందర్ ఏ పనీ చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. భార్యాబిడ్డను తరచూ వేధిస్తుండేవాడు. దీంతో భావన 2023 ఫిబ్రవరి చివరి వారంలో బిడ్డను వదిలేసి, పుట్టింటికి వెళ్లిపోయింది. కూతురిని చంపేందుకు ఇదే అదునుగా భావించిన మహేందర్ అదే ఏడాది మార్చి1న రాత్రి ఆమెను హత్య చేసి, కెనాల్‌లో పడేశాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు మహేందర్‌పై కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ విజ్ఞాన్ రావు దర్యాప్తు చేపట్టారు. సీఎంఎస్‌పీ ఎస్సై తిరుపతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు విచారించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి, మహేందర్‌కు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

అక్రమ రిజిస్ట్రేషన్.. తండ్రీకూతురి అరెస్టు

- పరారీలో అల్లుడు

చందుర్తి(వేములవాడ): ఇంటిని అక్రమంగా గిఫ్ట్ డీడ్ చేసుకున్న కేసులో తండ్రీకూతురిని అరెస్టు చేశామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని నర్సింగపూర్‌కు చెందిన జాగిరి దేవలింగం అలియాస్ దేవయ్యకు నలుగురు కుమారులున్నారు. వీరిలో నర్సయ్య తన ముగ్గురు సోదరులకు రూ.80 వేలు చెల్లించి, ఉమ్మడి ఇంటిని తీసుకున్నాడు. అయితే, ఈ అన్నదమ్ముల్లో ఒకరైన పర్శరాములు ఇదే ఇంటిని తన కూతురు మానస పేరిట గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించాడు. అతని అల్లుడు నేరెల్ల రమేశ్ డాక్యుమెంట్ రైటర్ కావడంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పర్శరాములు, మానస, రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండ్రీకూతురిని మంగళవారం అరెస్టు చేయగా, అల్లుడు రమేశ్ పరారైనట్లు తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత, నైపుణ్యం గల వారికి విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తెలిపారు. దుబాయ్ లాంటి దేశాల్లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు ఎస్సెస్సీ విద్యార్హత, రెండేళ్ల అనుభవం చాటే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 40 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ అర్హతతో సెక్యూరిటీ గార్డు పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94400 50951 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం

చిగురుమామిడి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లికి చెందిన దరిపెల్లి రవి(31) మంగళవారం సుందరగిరి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో టాటాఏస్ వాహనం సుందరగిరి వైపు నుంచి వస్తోంది. బొమ్మనపల్లి ఊరిలోనే బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి కుడికాలు పూర్తిగా విరిగిపోగా, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. మద్యంతాగి బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి వెనుకకు అతి వేగంగా వెళ్తూ మరో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. చరణ్‌ను కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

న్యాయవాదికి...

సిరిసిల్ల క్రైమ్ : పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ధర్మేందర్ కారులో కరీంనగర్ వెళ్తుండగా చింతకుంట వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నుజునుజ్జుకాగా ధర్మేందర్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

గడియారానికి బదులు రాళ్లు


రాళ్లు, పిల్లలు ఆడుకునే వాచ్‌ను చూపుతున్న రాజు

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): రూ.2 వేల విలువైన వాచ్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వ్యక్తికి రాళ్లు, చిన్న పిల్లలు ఆడుకునే వాచ్ వచ్చాయి. బాధితుడి వివరాల ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీకి చెందిన రాజు నాలుగు రోజుల క్రితం రూ.2 వేల విలువైన వాచ్‌ను బుక్ చేశాడు. మంగళవారం డెలివరీ బాయ్‌కి డబ్బులు చెల్లించి, బాక్స్‌ను తీసుకున్నాడు. ఓపెన్ చేసి, చూడగా.. అందులో ఎక్వేరియంలో ఉపయోగించే రంగు రాళ్లు, చిన్న పిల్లలు ఆడుకునే వాచ్ ఉన్నాయి. ఈ విషయమై డెలివరీ బాయ్‌ని ప్రశ్నించగా తనకు తెలియదన్నాడు. ఫోన్‌లోనే ఆర్డర్ రిటర్న్ పెట్టాలని చెప్పాడు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం: అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఉప్పుగుండ్ల మురళీకృష్ణ తల్లి రాజమణి కరీంనగర్ కట్టరాంపూర్‌లోని శాతవాహన కాలనీలో నివాసం ఉంటోంది. గత నెల 23న ఇంటికి తాళం వేసి, ఊరెళ్లింది. రెండు రోజుల తర్వాత తిరిగిరాగా, తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా టీవీ ధ్వంసమైంది. బీరువాలోని 20 గ్రాముల బంగారు, 46 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుంది. కరీంనగర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కోటేశ్వర్ కేసు నమోదు చేసి, తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక గౌతమి నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. సత్తిబాబును కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. అతనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కలిపి 20కి పైగా కేసులున్నట్లు, గతంలో జైలుశిక్ష సైతం అనుభవించినట్లు తెలిపారు.

ఇసుక లారీల అడ్డగింత

మానకొండూర్ రూరల్: మండలంలోని ఊటూరులో ఇసుక లారీలను స్థానికులు మంగళవారం కూడా అడ్డగించారు. గ్రామ శివారులోని మానేరు వాగు ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలిస్తుండగా సోమవారం సాయంత్రం అడ్డుకున్నారు. ఇసుకను అధిక మొత్తంలో తీసుకెళ్తున్నారని ఆరోపించారు. లారీలు వెళ్తుండటంతో రోడ్డు పాడవుతోందని, దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇసుకను నిర్ణీత సమయంలో కాకుండా రాత్రింబవళ్లు తరలిస్తున్నారని మండిపడ్డారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

శంకరపట్నం(మానకొండూర్): తాళం వేసిన ఇంట్లో చొరబడిన దుండగులు బంగారు గొలుసు, నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని అర్కండ్లకు చెందిన నేదురు ఐలమ్మ సోమవారం ఇంటికి తాళం వేసి, పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లిచూడగా.. రూ.74 వేలు, 2 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే గ్రామానికి చెందిన ఓ కుటుంబంపై అనుమానం ఉందని చెప్పింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

వెంకటాపూర్ గ్రామంలో..

కోరుట్ల రూరల్: తాళం వేసిన రెండిళ్లలో దుండగులు చొరబడి, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల రూరల్ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన కొత్తపెల్లి రాజేశ్వరి, పల్లా లక్ష్మీరాజం సోమవారం తమ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లారు. మంగళవారం ఉదయం పక్కింటివాళ్లు చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే బాధితులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి, చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. మూడున్నర తులాల బంగారు ఆభరణాలు పోయాయని రాజేశ్వరి, రెండు తులాల బంగారు ఆభరణాలు పోయాయని లక్ష్మీరాజం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యభిచార నిర్వాహకులపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని బైపాస్‌రోడ్‌లో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలతోపాటు, ఇద్దరు విటులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

రాజన్న కోడెలు అమ్ముకున్న ముగ్గురి అరెస్టు

- రాంబాబుతోపాటు మరో ఇద్దరి రిమాండ్
- రైతుల పేరిట సంతకాలు పెట్టి కోడెలను తీసుకువెళ్లారు..
- వివరాలు వెల్లడించిన గీసుకొండ సీఐ మహేందర్

గీసుకొండ(నర్సంపేట): వేములవాడ రాజన్న కోడెలను అమ్ముకున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. శ్రీరాజరాజేశ్వర సొసైటీ పేరిట గోశాల నడుపుతున్న వెలగందుల రాజు, కాంగ్రెస్ నాయకుడు మాదాసి రాంబాబు ఈ నెల 1న వేములవాడ దేవస్థానం నుంచి లేగదూడలు తీసుకొని వచ్చి, కబేళాలకు తరలిస్తున్నారు. వారిపై విశ్వహిందూ పరిషత్‌తోపాటు పలువురు గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాంబాబును అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అతడితోపాటు అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి (ప్రస్తుతం అనంతారం నివాసి)కి చెందిన పశునూని శ్యాంసుందర్ కలిసి వారి కుటుంబ సభ్యులతోపాటు గీసుకొండ, దుగ్గొండి మండలంలో తెలిసిన రైతుల నుంచి ఆధార్‌కార్డులు, భూమి పత్రాలను సేకరించారు. అనంతరం వేములవాడ గోశాలకు వెళ్లి అక్కడి దేవాలయ అధికారుల సహకారంతో రైతుల సంతకాలు పెట్టారు. రెండు విడతలుగా 66 కోడెలను గీసుకొండ మండలం గట్టుకిందిపల్లిలోని మాదాసి రాంబాబు కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తున్న భూమి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించారు. వాటిలో 28 కోడెలను అమ్ముకోగా మరో 26 కోడెలను వేములవాడ గోశాలకు తిరిగి అప్పగించారు. అలాగే, మూడు కోడెలు చనిపోగా, మిగిలిన మరో 9 కోడెలను స్వాధీనం చేసుకున్నామని, దీనికి బాధ్యులైన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుల ఫొటోలు కావాలని పోలీసులను విలేకరులు కోరగా.. ఆయన స్పందించలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకే మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

- బాలుర విభాగంలో కరీంనగర్..
- బాలికల విభాగంలో ఖమ్మం ప్రథమ స్థానం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. బాలుర విభాగంలో కరీంనగర్ ప్రథమ స్థానంలో, మహబూబ్‌నగర్ ద్వితీయ, ఖమ్మం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఖమ్మం ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, హైదరాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో జనార్దన్‌రావు హాజరై, మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతాయన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు.అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు అనేక క్రీడా పోటీలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలిపిస్తే గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తా..

నిరుద్యోగ యువతకు బాసటగా నిలిచేందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీలో ఉంటున్నానని, గెలిపిస్తే గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను 600 మంది నిరుద్యోగ యువతకు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను అనేక గ్రంథాలయాలకు వెళ్లానని, చాలాచోట్ల మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. సొంత ఖర్చులతో నిరుద్యోగులకు భోజన ఏర్పాటు చేయడంతోపాటు చైర్ ప్యాడ్స్, వాటర్ కూలర్స్, సింటెక్ ట్యాంకులు, కొన్నిచోట్ల అదనపు తరగతి గదులకు రేకులు వేయించానని పేర్కొన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర మధుసూదన్ రెడ్డి, చందు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని రక్షిస్తేనే హక్కులకు రక్షణ'



మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

జగిత్యాలరూరల్: రాజ్యాంగాన్ని రక్షిస్తేనే హక్కులకు రక్షణ ఉంటుందని కేంద్ర సమాచార మాజీ కమిషనర్, విద్యావేత్త మాడభూషి శ్రీధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులు అడిగితే వస్తాయి తప్ప మౌనంగా ఉంటే రావని తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు లత గంగారాం, జాతీయ అధ్యక్షుడు అయిల్నేని శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరమల్ల సందీప్, కార్యదర్శి నాగరాజు, నాయకుడు చుక్క గంగారెడ్డి, జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, సంస్థ సెర్ప్ ఏపో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ అధికారుల అడ్డగింత

- ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని శాఖ పరిధిలోకి తీసుకోవడంపై అభ్యంతరం
- వీడీసీ ఆధ్వర్యంలోనే కొనసాగాలన్న సభ్యులు


అధికారులను అడ్డుకుంటున్న వీడీసీ సభ్యులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకోవద్దని వీడీసీ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంబంధిత అధికారులు మంగళవారం ఆలయానికి రావడంతో వారితో వాగ్వాదానికి దిగారు. ఆలయ నిర్వహణ వీడీసీ ఆధ్వర్యంలోనే కొనసాగాలన్నారు. ఇందుకు వారు అంగీకరించలేదు. పోలీసుల బందోబస్తు మధ్య ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ సమయంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది వీడీసీ సభ్యులను, గ్రామస్తులను సముదాయించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. తైబజార్ రుసుము, మేక, కోడి కోతకు ఎంత వసూలు చేస్తున్నారు.. తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి ఆలయ ఈవోగా కాంతారెడ్డి బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. ప్రతీ మంగళవారం ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. వారు అమ్మవారికి సమర్పించే కానుకలు, డబ్బులు పక్కదారి పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, విచారణలో నిజమేనని తేలిందన్నారు. ఈ కారణంగానే ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వీడీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును కలిశారు. ఆలయ నిర్వహణ వీడీసీ ఆధ్వర్యంలోనే సాగేలా చూడాలని విన్నవించారు.

మేనేజ్‌మెంట్ విద్యాసంస్థతో ఒప్పందం


ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: కళాశాల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు, కళాశాల అధ్యాపకులకు రీసెర్చ్ వర్క్‌షాప్, శిక్షణ కల్పించాలనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ విద్యాసంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్ ఆవరణలో కళాశాల అధ్యాపకులు, ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ కన్వీనర్ బూర్ల నరేశ్, కె.అర్జున్, ఐపీఈ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ మూర్తి, వై.రామకృష్ణ బృందం సమక్షంలో ఎస్సారార్ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు, ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీకాంత్, లక్ష్మీకుమారి, వై.రామకృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.